సాక్షి విశాఖపట్నం

ఆదివారం । 22 । డిసెంబర్ । 2024

న్యూస్ రీల్

నియామకం

తాటిచెట్లపాలెం: వాల్తేర్ డివిజన్ ప్రోటోకాల్ ఇన్‌స్పెక్టర్‌గా ఎస్‌కే మహ్మద్ రసూల్‌ను నియమించినట్లు ఈస్ట్‌కోస్ట్‌రైల్వే అధికారులు తెలిపారు. ఇప్పటివరకు వాల్తేర్ డివిజన్‌లోనే ఆపరేటింగ్ విభాగంలో డిప్యూటీ చీఫ్ యార్డ్ మాస్టర్‌గా విధులు నిర్వర్తిస్తున్న రసూల్ త్వరలోనే జనరల్ అడ్మినిస్ట్రేషన్ విభాగం పరిధిలో చీఫ్ ప్రోటోకాల్ ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు చేపట్టనున్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

డాబాగార్డెన్స్: జీవీఎంసీ తరఫున స్టాండింగ్ కౌన్సిల్ నియమించేందుకు న్యాయవాదుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జీవీఎంసీ కమిషనర్ పి.సంపత్‌కుమార్ శనివారం ప్రకటనలో పేర్కొన్నారు. 8 మంది న్యాయవాదుల నియామకం కోసం నోటిఫికేషన్ స్థానిక బార్ కౌన్సిల్ నందు ప్రకటించామన్నారు. ఓపెన్ కేటగిరీ (ఓసీ జనరల్)-4, బీసీ-ఏ-1, బీసీ-బీ-1, ఎకనామికల్ వీకర్ సెక్షన్స్ 1, ఎస్టీ 1 పోస్టులకు సంబంధించి దరఖాస్తులు కోరుతున్నట్లు చెప్పారు. న్యాయవాదులు బార్ కౌన్సిల్లో కనీసం పదేళ్ల సభ్యుడిగా రిజిస్ట్రేషన్ కల్గి ఉండిన వారు మాత్రమే అర్హులని పేర్కొన్నారు. దరఖాస్తులు జీవీఎంసీ ప్రధాన కార్యాలయానికి అందజేయాలని, చివరి తేదీ జనవరి 6, 2025గా నిర్ణయించామన్నారు.

ఆక్రమణలకు పాల్పడితే చర్యలు

విశాఖ సిటీ: వీఎంఆర్‌డీఏకు సంబంధించిన వాణిజ్య సముదాయాలు, ఖాళీ స్థలాలను లీజుకు తీసుకున్న వారు కేటాయించిన స్థలం కంటే ఎక్కువగా ఆక్రమిస్తే చర్యలు తప్పవని వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్ ప్రణవ్‌గోపాల్, మెట్రోపాలిటన్ కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్ ఒక ప్రకటనలో హెచ్చరించారు. కైలాసగిరి రోప్ వే ఎదురుగా ఉన్న రాక్‌పార్క్‌లో సంస్థ కేటాయించిన స్థలం కంటే ఎక్కువగా ఆక్రమించి వ్యాపారం చేస్తున్న వారిపై చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఆ దుకాణాన్ని సీజ్ చేసినట్లు వెల్లడించారు. వ్యాపారులకు కేటాయించిన స్థలంలోనే కార్యకలాపాలు నిర్వహించుకోవాలని, లేనిపక్షంలో చర్యలు తప్పవని స్పష్టం చేశారు.



కళాభారతి ఆడిటోరియంలో వార్షిక నృత్యోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. శనివారం శ్రీకృష్ణ పారిజాతం నృత్య రూపకం అలరించింది.

8లో



భీమిలి మండలం చిననాగమయ్య పాలెంలో 40 అడుగుల జగన్ ఫ్లెక్సీ



రాజ్యసభ సభ్యుడు గొల్ల బాబూరావుకు కేక్ తినిపిస్తున్న మేయర్ గొలగాని హరి వెంకట కుమారి. చిత్రంలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు అమర్‌నాథ్, ఎమ్మెల్సీలు వరుదు కళ్యాణి, పండుల రవీంద్రబాబు, మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్, సమన్వయకర్త కె.కె రాజు.

జనాభిమానం..

సేవా సంబరం

పండగలా మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలు

జిల్లా వ్యాప్తంగా సేవా కార్యక్రమాలు

పాల్గొన్న మాజీ మంత్రి అమర్‌నాథ్, పార్టీ నేతలు

జన హృదయనేత..మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలు శనివారం జిల్లా అంతటా వేడుకగా నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు, అభిమానుల ఆధ్వర్యంలో రక్తదానాలు, అన్నదానాలు, చీరలు పంపిణీ వంటి సామాజిక సేవా కార్యక్రమాలతో పాటు బర్త్‌డే కేక్‌లు కట్ చేశారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చల్లగా ఉండాలని మనసారా ఆశీర్వదించారు.

- ✔ గాజువాక నియోజవర్గంలో మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ఆధ్వర్యంలో 66, 67, 72, 68, 70, 72,74, 86, 87వ వార్డుల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలు నిర్వహించారు.
- ✔ విశాఖ దక్షిణలో 29, 31, 33, 34, 35, 37, 41వ వార్డుల్లో ఆయా కార్పొరేటర్లు, వార్డు ఇన్‌చార్జిల ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే గణేష్‌కుమార్ పాల్గొన్నారు.
- ✔ విశాఖ ఉత్తరలో 14, 44, 46,47, 49వ వార్డుల్లో నిర్వహించిన వేడుకల్లో సమన్వయకర్త కె.కె రాజు పాల్గొన్నారు. వృద్ధులకు పండ్లు, మహిళలకు చీరలు పంపిణీ చేశారు.
- ✔ భీమిలి నియోజకవర్గంలో అర్బన్, రూరల్ పరిధిలో జగన్ జన్మదిన వేడుకలు నిర్వహించారు. విస్తృతంగా సేవా కార్యక్రమాలు చేశారు.
- ✔ విశాఖ తూర్పులో 28వ వార్డులో పల్లా దుర్గారావు ఆధ్వర్యంలో నిర్వహించిన జన్మదిన వేడుకల్లో మేయర్ గొలగాని హరి వెంకట కుమారి పాల్గొన్నారు.
- ✔ పెందుర్తి నియోజవర్గంలో మాజీ ఎమ్మెల్యే, సమన్వయకర్త అన్నంరెడ్డి అదీప్‌రాజ్ ఆధ్వర్యంలో పెందుర్తి మండలం రాంపురంలో నిర్వహించిన వేడుకల్లో మాజీ మంత్రి బూడి ముత్యాలనాయుడు పాల్గొన్నారు.
- ✔ విశాఖ పశ్చిమలో 40,56,52,57,59, 60,62,63,89,90 వార్డుల్లో వేడుకలు నిర్వహించారు.



పార్టీ జిల్లా కార్యాలయంలో రక్తదానం చేస్తున్న గుడివాడ అమర్‌నాథ్ తదితరులు



ఉత్తర: నక్కవానిపాలెంలో పేదలకు చీరలు పంపిణీ చేస్తున్న వైఎస్సార్ సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కేకే రాజు



దక్షిణ: జగదాంబ జంక్షన్ వద్ద పేదలకు చీరలు పంపిణీ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్



పెందుర్తి: రాంపురంలోని క్యాంప్ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే అదీప్‌రాజ్‌కు కేక్ తినిపిస్తున్న మాజీ ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు

సాక్షి, విశాఖపట్నం:

మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలను ప్రపంచంలో ఉన్న తెలుగు ప్రజలంతా ఓ పండగలా నిర్వహించుకున్నారని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్ కొనియాడారు. కోట్లాది మంది అభిమానులు, వైఎస్సార్ సీపీ శ్రేణులు జగనన్నను ఆశీర్వదించారన్నారన్నారు. శనివారం మద్దిలపాలెం పార్టీ జిల్లా కార్యాలయంలో గుడివాడ అమర్‌నాథ్ ఆధ్వర్యంలో జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్ సీపీ సీనియర్ నేత మారుతి ప్రసాద్ నిర్వహణలో గుడివాడ అమర్‌నాథ్, రాజ్యసభ సభ్యుడు గొల్ల బాబూరావు, ఎమ్మెల్సీలు వరుదు కల్యాణి, పండుల రవీంద్రబాబు, మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, ఉత్తర సమన్వయకర్త కె.కె రాజు, మాజీ ఎంపీ గొడ్డేటి మాధవి కేక్ కట్ చేశారు. అనంతరం వైఎస్సార్ సీపీ సీనియర్ నేత మొల్లి అప్పారావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌తో పాటు బ్రాహ్మణ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ పూర్ణానంద శర్మ, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు రక్తదానం చేశారు. జిల్లా ఎస్సీ విభాగం నాయకులు బోని శివరామకృష్ణ ఆధ్వర్యంలో అమర్‌నాథ్, గొల్ల బాబూరావులు మహిళలకు చీరలు పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్ మాట్లాడుతూ.. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో లబ్ధి పొందిన కోట్లాది ప్రజలంతా మళ్లీ సీఎంగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కావాలని కోరుకుంటున్నారన్నారు. రాజ్యసభ సభ్యుడు గొల్ల బాబూరావు మాట్లాడుతూ..వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని, ఈ రాష్ట్రానికి మళ్లీ ముఖ్యమంత్రిగా సంక్షేమ పాలన అందించాలని ఆకాంక్షించారు. ఎమ్మెల్సీలు వరుదు కల్యాణి, పండుల రవీంద్ర మాట్లాడుతూ.. గత ఐదేళ్లలో పేద ప్రజలకు అనేక సంక్షేమ పథకాలు అందజేసి సంక్షేమ పాలన తీసుకొచ్చిన ఘనత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదేనన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు వాసుపల్లి గణేష్ కుమార్, తైనాల విజయకుమార్, తిప్పలనాగిరెడ్డి, చింతలపూడి వెంకట్రామయ్య, డిప్యూటీ మేయర్ కె. సతీష్, పార్టీ కార్యాలయ పర్యవేక్షకులు రవిరెడ్డి, రాష్ట్ర పార్టీ అనుబంధ విభాగాల అధ్యక్షులు జాన్‌వెస్లీ, పేర్ల విజయ్‌చందర్, మహంతి, పార్టీ ముఖ్యనాయకులు రొంగలి జగన్నాథం, చొక్కాకుల వెంకట్రావ్, తిప్పల దేవాన్‌రెడ్డి, జహీర్ అహ్మద్, కొండా రాజీవ్‌గాంధీ, ద్రోణంరాజు శ్రీవాత్సవ్, పేడాడ రమణకుమారి, మాధవీవర్మ, ఐహెచ్ ఫరూకీ, కాళిదాస్‌రెడ్డి, కృష్ణంరాజు, అద్దాల కృపాజ్యోతి, రామన్నపాత్రుడు, బాజీనాయుడు, వానపల్లి ఈశ్వరరావు, బొండా ఉమామహేశ్వరరావు, పెంద్ర అప్పన్న, తుల్లి చంద్రశేఖర్, రోజారాణి, రాజేశ్వరి,రాధ, జగదీష్, కొల్లి సింహాచలం, కార్పొరేటర్లు కె.సునీత, అనిల్ కుమార్‌రాజు, ముప్పల లక్ష్మి, సురేష్, పద్మారెడ్డి, బిపిన్‌కుమార్ జైన్, మసిగపోగు రాజు, కోడిగుడ్ల పూర్ణిమ, శ్రీధర్, అల్లు శంకర్‌రావు, రెయ్యి వెంకటరమణ, బర్కత్ అలీ, శశికళ, మహమ్మద్ ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.



గాజువాక: పెదగంట్యాడ జంక్షన్‌లో పేద మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న మాజీ ఎమ్మెల్యేలు నాగిరెడ్డి, గురుమూర్తిరెడ్డి



భీమిలి: పద్మనాభంలో రక్తదాన శిబిరంలో పాల్గొన్న ఎంపీపీ రాంబాబు తదితరులు



పశ్చిమ : 52వ వార్డు శాంతినగర్‌లో కేక్ కట్‌చేస్తున్న డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ తదితరులు



తూర్పు: రామ్‌నగర్‌లోని లయన్స్ క్లబ్‌లో రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్

పండుటాకులపై పగ



- అనర్హుల పేరుతో పింఛన్ ఏరివేతకు కూటమి ప్రభుత్వం సిద్ధం
- ఆరు దశలలో సర్వే నిర్వహిస్తున్న సిబ్బంది
- పెన్షన్ రూ.4 వేలు చేయడంతో భారాన్ని తగ్గించుకునే కుట్ర
- భారీగా లబ్ధిదారుల్లో కోత పెట్టాలని నిర్ణయం
- ఇందిరానగర్‌లో చేపట్టిన సర్వేలో 5 శాతం తొలగింపునకు చర్యలు

మహారాణిపేట: పండుటాకులపై కూటమి ప్రభుత్వం పగబట్టింది. అనర్హుల పేరుతో సామాజిక పింఛన్ల ఏరివేతకు సిద్ధమవుతోంది. పింఛన్ భారాన్ని తగ్గించుకోడానికి భారీ ఎత్తున కోత విధించాలని నిర్ణయించింది. ఇందుకోసం ఆరు దశల (సిక్స్ స్టెప్ సర్వే) పరిశీలన ప్రక్రియను శరవేగంగా చేపడుతోంది. తద్వారా ఏళ్ల తరబడి పెన్షన్ పొందుతున్న లబ్ధిదారుల సంఖ్యను గణనీయంగా తగ్గించాలని భావిస్తోంది. ఇటీవల ఇందిరానగర్-2లో చేపట్టిన సర్వేలో ఐదు శాతం లబ్ధిదారులను అనర్హులుగా అధికారులు తేల్చారు. దీంతో అన్ని సామాజిక పింఛనుదారుల్లో ఆందోళన నెలకొంది.

ఖజానాపై భారం తగ్గించుకోడానికే..

తాము అధికారంలోకి వచ్చిన వెంటనే పింఛన్‌ను రూ.3 వేల నుంచి రూ.4 వేలకు పెంచుతామని ఎన్నికల ముందు చంద్రబాబు ప్రకటించారు. దీంతో లబ్ధిదారులు కూటమికి అధికారాన్ని కట్టబెట్టారు. అయితే ఆ హామీ నిలబెట్టుకునేందుకు కూటమి ప్రభుత్వం అడ్డదారులను వెతుకుతోంది. ఈ నేపథ్యంలో ఖజనాపై భారం తగ్గించుకోవడానికి లబ్ధిదారుల సంఖ్యను కుదించాలని నిర్ణయించింది. ఇప్పటికే ప్రతి నెలా పింఛనుదారుల్లో కోత విధిస్తూ వచ్చింది. తాజాగా తనిఖీల పేరుతో భారీ సంఖ్యలో పింఛన్‌దారులను తొలగించాలని నిర్ణయించింది. అయితే తెలుగుదేశం పార్టీకి అనుకూలంగా లేరన్న అక్కసుతో స్థానిక నేతల ఒత్తిళ్లతో కొంత మంది పేరు తప్పిస్తున్నారన్న ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. ఎన్నికల ఫలితాల ముందు వరకు పింఛన్లు అందించిన అధికారులు.. ఈ రెండు నెలల్లో కుంటిసాకులు చెప్పి కొంత మంది పేర్లను తొలగించడం గమనార్హం.

నెల నెలా కోత..

- వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో మొత్తం 1,65,891 మంది లబ్ధిదారులు ఉండేవారు.
- కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత : జూలైలో 1,64,239 మందికి మాత్రమే పింఛను అందజేశారు.
- ఆగస్టులో పింఛన్‌దారుల సంఖ్య 1,62,490కి తగ్గిపోయింది.
- సెప్టెంబర్‌లో 1.62 లక్షలమందికి కుదించారు.
- అక్టోబర్‌లో లబ్ధిదారుల సంఖ్య 1,61,969, నవంబర్, డిసెంబర్‌లో 1,61,584 మంది లబ్ధిదారులను కుదించారు.

కూటమి అధికారంలోకి రాగానే

2014లో అధికారంలోకి రాగానే జన్మభూమి కమిటీల పేరిట... ఉన్న పెన్షన్లకు టీడీపీ ప్రభుత్వం ఎలా కోత విధించిందో.. ఈసారీ సీన్ రిపీట్ చేసింది. ఈ ఏడాది ఎన్నికల నోటిఫికేషన్ సమయానికి మార్చి నెలలో విశాఖ జిల్లాలో 1,65,891 మంది పింఛనుదారులుండేవారు. కానీ ప్రస్తుతం 1,61,584 మందే ఉన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత ఇప్పటి వరకు 4,307 మంది లబ్ధిదారులను తొలగించారు.



వానలకు తాత్కాలిక విరామం

24 నుంచి మళ్లీ వర్ష సూచన



నగరంలో జోరు వాన

సాక్షి, విశాఖపట్నం: మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలకు వరుణుడు తాత్కాలిక విరామం ప్రకటించారు. పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం విశాఖ జిల్లాపై తీవ్ర ప్రభావాన్ని చూపించింది. గడిచిన మూడు రోజుల్లో పలుచోట్ల దాదాపు 100 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. ముసురు వాతావరణం నెలకొనడంతో.. చిరు వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. రెండు రోజులుగా వర్షాల కారణంగా పాఠశాలలు, కాలేజీలకు వెళ్లేందుకు ఇక్కట్లు పడిన విద్యార్థులకు.. జిల్లా కలెక్టర్ శనివారం సెలవు ప్రకటించడంతో కాస్తా ఉపశమనం పొందారు. పాదచారులు, వాహనదారులు అవస్థలు పడ్డారు. శనివారం మధ్యాహ్నం వరకూ చిరు జల్లులుగా కురిసింది. సాయంత్రం నుంచి వర్షాలు పూర్తిగా తగ్గుముఖం పట్టడంతో.. విశాఖ వాసులు కాస్తా ఉపశమనం పొందారు. ఇదిలావుండగా ఈ నెల 24,25 తేదీల్లో జిల్లాలో మళ్లీ ఓ మోస్తరు వర్షాలు పడే అవకాశాలున్నాయని వాతావరణశాఖ ప్రకటించింది.



అలల తాకిడికి నేలకొరిగిన కొబ్బరి చెట్లు

సమన్వయంతో నావికాదళ విన్యాసాలు

నేవీ, జిల్లా అధికారులతో క్షేత్రస్థాయిలో సమీక్షించిన కలెక్టర్ హరేంధిర ప్రసాద్

ఏయూక్యాంపస్: సాగర తీరంలో జనవరి 4వ తేదీన నిర్వహించనున్న నావికాదళ విన్యాసాల నిర్వహణలో అందరూ సమన్వయంతో విజయవంతం చేయాలని కలెక్టర్ ఎం.ఎన్ హరేంధిర ప్రసాద్ పిలుపునిచ్చారు. నావికాదళం, జీవీఎంసీ, వీఎంఆర్‌డీఏ కమిషనర్లతో కలిసి శనివారం ఆయన క్షేత్రస్థాయి పర్యటించారు. విశ్వప్రియ ఫంక్షన్ హాల్, ఆర్.కె బీచ్ పరిసర ప్రాంతాలలో ఏర్పాట్లపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. ప్రధాన వేదిక నిర్మాణం, ఫైర్ వర్క్, లేజర్ షో, డ్రోన్ షో నిర్వహణ, ఇతర ఏర్పాట్లపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి ఇతర మంత్రులు భాగస్వామ్యం కానున్న నేపథ్యంలో పటిష్ట భద్రతా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. సాధారణ ప్రజలకు ఇబ్బంది కలగకుండా బారికేడింగ్ పూర్తిస్థాయిలో చేయాలని, పబ్లిక్ అడ్రస్ సిస్టం పక్కాగా ఏర్పాటు చేయాలని కలెక్టర్ చెప్పారు.



నావికాదళ అధికారులతో చర్చిస్తున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

అభివృద్ధి పనులకు ఎక్కువ నిధులు కేటాయించాలి

డాబాగార్డెన్స్: జీవీఎంసీ అభివృద్ధి పనులకు సంబంధించి బడ్జెట్‌లో అధిక నిధులు కేటాయించాలని, అందుకు తగిన విధంగా బడ్జెట్‌ను సవరించాలని స్థాయీ సంఘం సభ్యులు మేయర్ గొలగాని హరి వెంకటకుమారి అధ్యక్షతన అధికారులను కోరారు. జీవీఎంసీ 2025-26 బడ్జెట్‌పై శనివారం జీవీఎంసీ ప్రధాన కార్యాలయ సమావేశ మందిరంలో మేయర్, స్థాయీ సంఘం చైర్‌పర్సన్ గొలగాని వెంకటకుమారి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. స్థాయీ సభ్యులకు బడ్జెట్‌లో పొందుపరచిన అంశాలను అధికారులు వివరించారు. నియోజకవర్గ అభివృద్ధికి ప్రత్యేకంగా నిధులు జీవీఎంసీకి వస్తాయని, జన్మభూమి-2లో భాగంగా నగరంలో ప్రతిపాదించే వివిధ అభివృద్ధి పనులకు నిధులు కేటాయిస్తూ బడ్జెట్‌లో పెట్టాలన్నారు. గత ప్రభుత్వంలో ఎస్సీ ఉప ప్రణాళిక నిధులు రాలేదని, ఇకపై ఆయా నిధులకు కూడా బడ్జెట్‌లో కేటాయింపులు చేయాలని కోరారు. సమావేశంలో స్థాయీ సంఘం సభ్యులతో పాటు అదనపు కమిషనర్ ఎస్ఎస్ వర్మ, ప్రధాన ఇంజినీరు శివప్రసాదరాజు, ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ వాసుదేవరెడ్డి, అసిస్టెంట్ ఎగ్జామినర్ ఆదినారాయణ, చార్టర్డ్ అకౌంటెంట్ సత్యనారాయణ పలువురు అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మేయర్, స్థాయీ సంఘం చైర్‌పర్సన్ హరి వెంకటకుమారి

26న కనకమహాలక్ష్మికి సహస్ర ఘటాభిషేకం

మధ్యాహ్నం 3 నుంచి రాత్రి 7 గంటల వరకు దర్శనాలు బంద్

డాబాగార్డెన్స్: మార్గశిర మాసోత్సవాల్లో భాగంగా ఈ నెల 26న సాయంత్రం 4 గంటలకు కనకమహాలక్ష్మి అమ్మవారికి సహస్ర ఘటాభిషేకం నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో ఆ రోజు మధ్యాహ్నం 3 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు దర్శనాలు నిలిపివేస్తున్నట్లు ఆలయ ఈవో కె.శోభారాణి తెలిపారు. అలాగే ఆ రోజు సాయంత్రం 6 గంటలకు నిర్వహించే పంచామృతాభిషేక సేవా టికెట్లు రద్దు చేశామని, భక్తులు ఈ విషయాన్ని గమనించాలని ఈవో సూచించారు.

ప్రేమ పేరుతో మోసం

టీచ్‌రోడ్డు: పదహారేళ్ల బాలికను ప్రేమ పేరుతో మోసం చేసిన ఆటోడ్రైవర్‌పై మూడో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాలివీ.. రేసపువానిపాలేనికి చెందిన బాలికను ఆటోడ్రైవర్ ముఖేష్ కుమార్ ప్రేమ పేరుతో లొంగదీసుకున్నాడు. ఈ క్రమంలో వివాహం చేసుకోవాలని బాలిక ఒత్తిడి చేయడంలో అతను ముఖం చాటేశాడు. దీంతో ఆమె కుటుంబ సభ్యులు మూడో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో శనివారం ఫిర్యాదు చేశారు. అతనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కళా ప్రపంచం.. కనులకు ఆనందం

ఆకట్టుకుంటున్న ఫైన్ ఆర్ట్స్ ఫెయిర్-2024



కాన్వాస్ సంచికను ఆవిష్కరిస్తున్న వీసీ శశిభూషణరావు



ఆభరణాలను తిలకిస్తున్న విద్యార్థులు



ఆకట్టుకుంటున్న కళాఖండాలు

విశాఖ విద్య: ఆంధ్ర విశ్వవిద్యాలయం ఫైన్ ఆర్ట్స్ విభాగంలో ఏర్పాటు చేసిన 'ఫైన్ ఆర్ట్స్ ఫెయిర్-2024' లో ప్రదర్శించిన చిత్రాలు విద్యార్థుల సృజనాత్మకతకు అద్దం పడుతున్నాయి. ఫైన్ ఆర్ట్స్ కోర్సు అభ్యసిస్తున్న విద్యార్థులు తమ కళా నైపుణ్యంతో అద్భుత కళాఖండాలు సృష్టించారు. తమ ప్రతిభను రంగరించి అపురూప చిత్రాలు గీశారు. వారు కేవలం ఒక మాధ్యమానికే పరిమితం కాకుండా సమకాలీన అంశాలను స్పృశిస్తూ శిల్పాలు, ఇతర విజువల్ ఆర్ట్స్‌ను కూడా ప్రదర్శించగా.. అవి సందర్శకులను ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి. ఈ ప్రదర్శనను శనివారం ఏయూ వీసీ ఆచార్య జి. శశిభూషణరావు ప్రారంభించారు. విద్యార్థులు తీర్చిదిద్దిన కళాఖండాలను, అలంకరణ వస్తువులను తిలకించి వారిని ప్రశంసించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఏయూ శతాబ్ది ఉత్సవాలకు సంబంధించిన లోగో రూపకల్పనకు త్వరలో పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. విభాగాధిపతి ఆచార్య డి.సింహాచలం మాట్లాడుతూ ఈ ప్రదర్శన ఈ నెల 29 వరకు కొనసాగుతుందన్నారు. ఏయూ రెక్టార్ ఎన్. కిశోర్ బాబు, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఎ. నరసింహారావు, విభాగ బీవోఎస్ చైర్మన్ శిష్టా శ్రీనివాస్, మయూక దేవి పాల్గొన్నారు. ఈ సందర్భంగా విభాగం ఆధ్వర్యంలో నూతనంగా ప్రారంభించిన ప్రత్యేక సంచిక 'కాన్వాస్'ను వీసీ ఆవిష్కరించారు.

అవకాశాలను అందిపుచ్చుకోవాలి

- నయంత యూనివర్సిటీ సీఈఓ రంజన్ బెనర్జీ
- సెంచూరియన్‌లో ఘనంగా స్నాతకోత్సవం



సెంచూరియన్ విశ్వ విద్యాలయంలో విద్యార్థికి డిగ్రీ పట్టా అందజేస్తున్న అతిథులు

నెల్లిమర్ల రూరల్: అవకాశాలను విద్యార్థులు అందిపుచ్చుకోవాలని నయంత విశ్వ విద్యాలయం సీఈవో ప్రొఫెసర్ రంజన్ బెనర్జీ పిలుపునిచ్చారు. విజయనగరం జిల్లా నెల్లిమర్ల మండలంలోని టెక్కలి సెంచూరియన్ విశ్వ విద్యాలయంలో వర్సిటీ 4వ స్నాతకోత్సవం శనివారం ఘనంగా జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన రంజన్ బెనర్జీ మాట్లాడుతూ ఏ రంగంలోనైనా విద్యార్థులు తమ అభిరుచులకు అనుగుణంగా కృషి చేసినప్పుడే గొప్ప విజయాలు సొంతమవుతాయన్నారు. ఉన్నత స్థాయికి వెళుతూనే ఇతరులకు చేయూతనివ్వాలన్నారు. ఇతరుల జీవితాల్లో చిరునవ్వులు చూడగలిగినప్పుడే మంచి విజయాలు సాధించినవారమవుతామన్నారు. సెంచూరియన్ వర్సిటీ అధ్యక్షుడు ప్రొఫెసర్ ముక్తికాంత మిశ్రా, ఉపాధ్యక్షుడు ప్రొఫెసర్ డీఎన్‌రావు విద్యార్థులు సాధించిన విజయాలను ప్రశంసించారు. వర్సిటీ చాన్సలర్ జీఎస్ఎన్ రాజు మాట్లాడుతూ ప్రపంచ స్థాయి ప్రమాణాలతో నాణ్యమైన విద్యను అందిస్తున్నందుకు గర్వంగా ఉందన్నారు. ఏడేళ్ల వ్యవధిలోనే దేశంలో అగ్రశ్రేణి విశ్వ విద్యాలయాల్లో ఒకటిగా సెంచూరియన్ అవతరించిందన్నారు. వైస్ చాన్సలర్ ప్రశాంత కుమార్ మహంతి మాట్లాడుతూ వర్సిటీను వ్యాపారం కోసం స్థాపించబడలేదని, శక్తివంతమైన విద్యార్థులను సమాజానికి అందించేందుకు నిరంతర కృషి చేస్తున్నామన్నారు. అనంతరం 201 మంది విద్యార్థులకు డిగ్రీలు, మరో ఐదుగురు విద్యార్థులకు పీహెచ్‌డీలు, 16 మందికి బంగారు పతకాలు, 8 మందికి నగదు ప్రోత్సాహకాలను వక్తలు అందజేశారు. కార్యక్రమంలో భువనేశ్వర్ వర్సిటీ వీసీ సుప్రియా పట్నాయక్, రిజిస్ట్రార్ పల్లవి, పాలకమండలి సభ్యుడు, పారిశ్రామిక వేత్త కుమార్ రాజా, డాక్టర్ పి.ఎస్.ఠాగూర్, ప్రొఫెసర్ కె.సి.బి.రావు, పీఎస్ఎస్‌వీ నరసింహం, ప్రొఫెసర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

రసవత్తరంగా నృత్యరూపకం

మద్దిలపాలెం: కళాభారతి ఆడిటోరియంలో వార్షిక నృత్యోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. రెండవ రోజు శనివారం శ్రీకృష్ణ పారిజాతం నృత్య రూపకం నయనానందకరం సాగింది. సెంట్రల్ సంగీత నాటక అకాడమీ పురస్కార గ్రహీత, కళారత్న బాలకొండల రావు శిష్య బృందం ఈ నృత్య రూపకాన్ని అద్భుతంగా ప్రదర్శించి ఆకట్టుకుంది. ముందుగా ఈ కార్యక్రమాన్ని కళాభారతి ట్రస్ట్ కార్యదర్శి గుమ్మాలూరి రాంబాబు, ముఖ్య అతిథి ఎ.మధుకుమార్, బాలకొండల రావు, టీకుముళ్ల శ్యామల జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం నృత్య కళాకారుల పదర్శించిన శ్రీకృష్ణ పారిజాతం నృత్యరూపకం ప్రేక్షకుల హృదయాలను కట్టిపడేసింది. ప్రతి సన్నివేశాన్ని చక్కని నాట్య భంగిమలతో రక్తికట్టించారు.

రష్యాలో గాజువాక వాసి మృతి



నారాయణ (ఫైల్)

గాజువాక: రష్యాలో వెల్డర్‌గా పని చేస్తున్న ఒక వ్యక్తి మృతి చెందాడు. మరణానికి కచ్చితమైన కారణాలు తెలియలేదని కుటుంబ సభ్యులు తెలిపారు. వివరాలివీ. గాజువాకలోని ఎల్‌బీఎస్ నగర్‌కు చెందిన ఎం.నారాయణ(35) స్థానిక ప్రజ్ఞా వెల్డింగ్ ఇన్‌స్టిట్యూట్ ద్వారా ఏడాదిన్నర కిందట వెల్డర్‌గా పని చేసేందుకు రష్యాలోని ఒక కంపెనీకి వెళ్లాడు. ఏడాది అగ్రిమెంట్ ముగిసిన వెంటనే ఇక్కడికి తిరిగి ఇచ్చాడు. ఇక్కడ 20 రోజులు గడిచిన తర్వాత ఆ కంపెనీ నారాయణ అగ్రిమెంట్‌ను రెన్యువల్ చేయడంతో 6నెలల కిందట మళ్లీ రష్యా వెళ్లాడు. అయితే అతడు మృతి చెందినట్టు ఆ కంపెనీ ప్రతినిధులనుంచి ఈ నెల 13న తమకు సమాచారం అందినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. నారాయణకు భార్య కుసుమ, ఇద్దరు కుమారులు, తల్లి, తండ్రి ఉన్నారు. మృత దేహం ఢిల్లీ వరకు వచ్చిందని, సోమవారం గాజువాకకు వస్తుందని కుటుంబ సభ్యులు తెలిపారు.

వేచి చూసి.. నిరాశతో వెనుదిరిగి..



పవన్‌కల్యాణ్‌కు వినతిపత్రం అందించేందుకు వేచి ఉన్న సమైక్య ప్రజారైతు సంక్షేమ సంఘం నాయకులు

సింహాచలం: పంచగ్రామాల భూసమస్య పరిష్కారం కోసం డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ని కలిసేందుకు అడవివరంలోని పాత గోశాల వద్ద వేచి ఉన్న సమైక్య ప్రజా రైతు సంక్షేమ సంఘం, జనసేన నాయకులకు నిరాశ ఎదురైంది. శనివారం ఉదయం నగరం నుంచి అడవివరం మీదుగా పెందుర్తి వైపు పవన్ కల్యాణ్ వెళ్తున్నారని తెలిసి.. భూ సమస్యను ఆయన దృష్టికి తీసుకెళ్లేందుకు వీరంతా అడవివరం పాతగోశాల వద్దకు చేరుకున్నారు. వర్షం పడుతున్నా పవన్ కోసం గొడుగులు వేసుకుని మరీ ఆయన రాక కోసం వేచి చూశారు. ప్లకార్డులు పట్టుకుని తమ సమస్య పరిష్కరించాలని నినాదాలు చేశారు. తీరా పవన్ కల్యాణ్ గోశాలకు చేరుకోవడం, కారు నుంచే అభివాదం చేసుకుని వెళ్లిపోవడం క్షణాల్లో జరిగిపోయింది. దీంతో జన సైనికులు, సమైక్య ప్రజా రైతు సంక్షేమ సంఘం నాయకులు నిరాశతో అక్కడి నుంచి వెనుదిరిగారు.

పారిశుధ్య కార్మికులకు కనీస వేతనాలు చెల్లించాలి



కార్మికుడికి తాళం అందిస్తున్న జాతీయ సఫాయి కర్మచారి కమిషన్ సభ్యుడు వావా

మహారాణిపేట: కార్మిక చట్టాల ప్రకారం జిల్లాలో సఫాయి కర్మచారి(పారిశుధ్య కార్మికులు)లకు కనీస వేతనం చెల్లించాలని జాతీయ సఫాయి కర్మచారి కమిషన్ సభ్యుడు డాక్టర్ పి.పి. వావా అన్నారు. శనివారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో సంబంధిత అధికారులతో ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. సఫాయి కర్మచారుల సామాజిక, ఆర్థిక, విద్యా స్థితిగతులను అధ్యయనం చేసి, సమాజంలో గౌరవంగా జీవించే అవకాశం కల్పించాలన్నారు. వారికి ప్రభుత్వ పథకాలు అమలు చేయాలని, బ్యాంకు రుణాలు మంజూరు చేయాలన్నారు. కార్మికులకు గుర్తింపు కార్డులు జారీ చేయాలన్నారు. పారిశుధ్య కార్మికులకు ప్రభుత్వం ఇళ్లు మంజూరు చేయాలన్నారు. కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్, జీవీఎంసీ కమిషనర్ పి.సంపత్ కుమార్ మాట్లాడుతూ జిల్లాలో పారిశుధ్య కార్మికులకు అందజేస్తున్న ప్రభుత్వ పథకాలు, వారి సంక్షేమానికి అందజేస్తున్న ఇతర సదుపాయాలను వివరించారు. అనంతరం పారిశుధ్య కార్మికులతో స్వయంగా కమిషన్ సభ్యులు డాక్టర్ పి.పి. వావా మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ రామారావు, ఎస్సీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సత్య పద్మ, కమిషన్ అడ్వైజర్ మెంబర్ సురేంద్ర నాథ్, డీసీపీ-1 అజిత, జిల్లా రెవెన్యూ అధికారి భవాని శంకర్, జిల్లా అధికారులు, పలువురు పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

కేజీహెచ్ సీఎస్ఆర్ఎంవోగా డాక్టర్ శ్రీహరి

మహారాణిపేట: వైద్య ఆరోగ్యశాఖలో పలువురికి పదోన్నతులు కల్పిస్తూ వైద్య ఆరోగ్యశాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఎం.టి.కృష్ణబాబు ఉత్తర్వులు జారీ చేశారు. తిరుపతి డీఎంహెచ్‌వో డాక్టర్ యు.శ్రీహరిని కేజీహెచ్ సీఎస్ఆర్ఎంవోగా నియమించారు. జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి(డీఐవో) ఎస్.జీవన్‌రాణిని విజయనగరం డీఎంహెచ్‌వోగా పదోన్నతి కల్పించి బదిలీ చేశారు. అనకాపల్లి జిల్లా కె.కోటపాడు సీహెచ్‌సీ వైద్యుడు ఎస్.శ్రీనివాస్‌ను ప్రభుత్వ విక్టోరియా ఆస్పత్రి సీఎస్ఆర్ఎంవోగా, శ్రీకాకుళం డీఎంహెచ్‌వో డాక్టర్ బి.మీనాక్షిని విశాఖలోని రీజినల్ ట్రెనింగ్ సెంటర్(ఆర్‌టీసీ) ప్రిన్సిపాల్‌గా నియమించారు.

ప్రశాంతంగా టీచర్ల ప్రమోషన్ల కౌన్సెలింగ్

విశాఖ విద్య: మున్సిపల్ స్కూళ్లలో పని చేస్తున్న ఉపాధ్యాయులకు శనివారం నిర్వహించిన ప్రమోషన్ల కౌన్సెలింగ్ ప్రశాంతంగా ముగిసింది. నగరంలోని డీఈవో కార్యాలయంలో జరిగిన కౌన్సెలింగ్‌కు జీవీఎంసీ పరిధిలోని విశాఖ, అనకాపల్లికు చెందిన ఉపాధ్యాయులు హాజరయ్యారు. మొత్తం 34 పోస్టుల భర్తీ కోసం కౌన్సెలింగ్ నిర్వహించగా.. అర్హతల మేరకు 23 మందికి ప్రమోషన్లు కల్పించినట్లు డీఈవో ప్రేమ్ కుమార్ తెలిపారు. అనంతరం ప్రమోషన్లు పొందిన ఉపాధ్యాయులకు ఉత్తర్వులు అందజేశారు.

గ్యాస్ట్రో ఇంటెస్టినల్ క్యాన్సర్ చికిత్సపై సదస్సు



సదస్సును ప్రారంభిస్తున్న వైద్యులు

ఏయూక్యాంపస్: మహాత్మా గాంధీ క్యాన్సర్ ఆస్పత్రి, రీసెర్చ్ సెంటర్ ఆధ్వర్యంలో శనివారం నగరంలోని ఓ హోటల్‌లో ఇండియన్ సొసైటీ ఆఫ్ మెడికల్ అండ్ పీడియాట్రిక్ ఆంకాలజీ 4వ సదస్సు జరిగింది. ఈ కార్యక్రమానికి దేశ వ్యాప్తంగా వంద మందికి పైగా ప్రతినిధులు పాల్గొనగా.. మహాత్మా గాంధీ క్యాన్సర్ ఆస్పత్రి ఎండీ డాక్టర్ వి.మురళీకృష్ణ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా గ్యాస్ట్రో ఇంటెస్టినల్ క్యాన్సర్ చికిత్సలో అపార అనుభవం కలిగిన 30 మంది నిపుణులు పలు అంశాలు వివరించారు. సదస్సులో భాగంగా గ్యాస్ట్రో ఇంటెస్టినల్ క్యాన్సర్ల నిర్ధారణ, చికిత్స, నిర్వహణలో తాజా పురోగతిపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కోర్సులో కేసు-ఆధారిత చర్చలు, ఆసక్తిదాయక ప్రసంగాలు, తాజా పరిశోధనలు, వైద్య రంగంలో జరుగుతున్న మార్పులు, ఆవిష్కరణలపై విస్తృతంగా చర్చించారు. డాక్టర్ పుష్ప బారిక్, డాక్టర్ సదాశివుడు, డాక్టర్ కృపాశంకర్ తదితరులు పాల్గొని విశిష్ట ప్రసంగాలు చేశారు.

బాలికల రవాణాకు అడ్డుకట్ట

తాటిచెట్లపాలెం: విశాఖపట్నం రైల్వేస్టేషన్ మీదుగా తమిళనాడుకు తరలిస్తున్న 11 మంది బాలికలను ఇటీవల రైల్వే పోలీసులు రక్షించారు. ఇందులో 9 మంది మైనర్లు ఉన్నారు. వీరంతా ఒడిశా రాష్ట్రం నవరంగ్‌పూర్‌కు చెందినవారు. ఒడిశాకు చెందిన రవిబిష్టోయ్ వీరిని తమిళనాడుకు తరలిస్తుండగా పట్టుబడ్డాడు. విశాఖపట్నం రైల్వే పోలీసులు అతన్ని విచారించి, కేసును ఒడిశా పోలీసులకు బదిలీ చేశారు. బాలికలను ప్రస్తుతం ప్రభుత్వ వసతి గృహంలో ఉంచారు. వారి తల్లిదండ్రులకు సమాచారం అందించారు. వారు వచ్చిన తర్వాత కౌన్సెలింగ్ ఇచ్చి అప్పగించనున్నట్లు తెలిసింది.

బుల్లయ్య విద్యార్థులకు అంతర్జాతీయ గుర్తింపు



విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల కరస్పాండెంట్

సీతంపేట: డాక్టర్ లంకపల్లి బుల్లయ్య కళాశాల లైఫ్ సైన్స్ విద్యార్థుల పరిశోధనకు అంతర్జాతీయ గుర్తింపు లభించింది. బీఎస్సీ లైఫ్ సైన్స్(బయోటెక్నాలజీ, మైక్రోబయాలజీ) ఆఖరి సంవత్సరం చదువుతున్న టి.హర్షిత, ఎ.తేజాంబిక్, జె.కార్తికేయ, ఎం.అశ్విని ఎన్విరాన్‌మెంటల్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ బి.మాధవి, జువాలజీ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ బి.శైలజ మార్గదర్శకత్వంలో 'విశాఖపట్నం సముద్ర తీరంలో సముద్రపు గడ్డి, పచ్చిక భూములను పునరుద్ధరించే బ్లూ కార్బన్ ఎకో సిస్టం పయనీరింగ్' అనే అంశంపై పరిశోధన చేశారు. స్టూడెంట్ సొసైటీ ఫర్ క్లైమేట్ చేంజ్ అవేర్‌నెస్(ఎస్ఎస్‌సీసీఏ), సీడ్స్ ఆఫ్ పీస్(యూఎస్ఏ) సంస్థలు సంయుక్తంగా నిర్వహించిన పోటీలో ఈ పరిశోధనను ఎంపిక చేశాయి. తదుపరి అధ్యయనాల కోసం విద్యార్థులు 2025 ఫిబ్రవరిలో 10 రోజుల ఫెలోషిప్ ప్రోగ్రాంకు అమెరికా వెళ్లనున్నారు. ఒడిశా రాష్ట్రంలోని చిలికా సరస్సు నుంచి హాలోఫిలా ఓవాలిస్, హాలోడ్యూల్ ఫినిఫోలియా అనే రెండు రకాల సముద్రపు గడ్డి జాతులను ఎంపిక చేసి, వాటికి అనుకూలమైన వాతావరణం కల్పించారు. తర్వాత ప్రయోగశాలలోనే సాగు చేశారు. సాగు చేసిన గడ్డి జాతులను నగరంలోని సముద్ర తీర ప్రాంతంలో తిరిగి నాటారు. దీంతో పరిశోధనలో తొలి దశ పూర్తి అయిందని వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ వాతావరణంలోని కార్బన్ డయాక్సైడ్‌ను ఈ గడ్డి జాతులు పీల్చుకుని గ్లోబల్ వార్మింగ్(వేడిని) తగ్గించడంలో సహాయపడటం ఈ పరిశోధన ప్రాజెక్టు ప్రధాన లక్ష్యమన్నారు. దేశానికి ప్రాతినిధ్యం వహిస్తున్న రెండు జట్లలో ఒకటిగా బుల్లయ్య విద్యార్థులు నిలవడం కళాశాలకు గర్వకారణమని కళాశాల కరస్పాండెంట్ జి.మధుకుమార్ అన్నారు. డిగ్రీ ప్రిన్సిపాల్ జీఎస్‌కే చక్రవర్తి, అధ్యాపకులు విద్యార్థులను అభినందించారు.

నమ్మిదొడ్డిలో కుళ్లిన మృతదేహం లభ్యం

అగనంపూడి: పెదగంట్యాడ మండలం నమ్మిదొడ్డి లక్ష్మీనగర్‌లోని ఒక రేకుల షెడ్డులో కుళ్లిపోయిన మృతదేహాన్ని గుర్తించారు. దువ్వాడ సీఐ మల్లేశ్వరరావు తెలిపిన వివరాలివీ.. హిందూజా పవర్ ప్లాంట్‌లో మెయింటెనెన్స్ పనులు నిర్వహించే కాంట్రాక్టర్ మద్ది వెంకటరావు వివిధ రాష్ట్రాలకు చెందిన కూలీలను ఇక్కడికి రప్పించి, లక్ష్మీనగర్‌లోని రేకుల షెడ్లలో వారికి వసతి కల్పించారు. అక్కడి నుంచి రోజూ కూలీలను పనుల కోసం హిందూజా పవర్‌ప్లాంట్‌కు తీసుకువెళ్లేవారు. కాంట్రాక్ట్ పనులు ముగియడంతో కూలీలు మార్చిలో వారి స్వస్థలాలకు వెళ్లిపోయారు. అప్పటి నుంచి ఈ రేకుల షెడ్లు ఖాళీగా ఉన్నాయి. మళ్లీ పనులు మొదలు కావడంతో కూలీలకు వసతి కల్పించేందుకు షెడ్లు, పరిసర ప్రాంతాలను శనివారం శుభ్రం చేయడానికి ఉపక్రమించారు. అయితే ప్రహరీకి, షెడ్డుకు మధ్యలో కుళ్లిన మృతదేహాన్ని కూలీలు గుర్తించి వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహం పూర్తిగా కుళ్లిపోయి ఉండడంతో ఎలాంటి వివరాలు లభ్యం కాలేదు. మృతదేహంపై నీలి రంగు ట్రాక్ ప్యాంట్ మాత్రమే ఉంది. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం కేజీహెచ్ తరలించారు.